సాక్షి
కర్నూలు
గురువారం ၊ 21 ၊ సెప్టెంబర్ ၊ 2023



సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీర భద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వి.బంగారురాజు రూ.1,00,500 విరాళంగా అందజేశారు.



సుంకేసులలో నీటి నిల్వలు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో బుధవారం 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

26వ తేదీనే వినాయక విగ్రహాల నిమజ్జనం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో ఈనెల 26వ తేదీనే వినాయక విగ్రహాల నిమజ్జనం చేయాలని శ్రీ గణేష మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎం. నాగఫణి శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ సూచించారు.నగరంలో సుమారు 2000 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేసీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో వినాయక ఘాట్‌లో 5, 7 రోజుల్లో అనగా ఈనెల 22, 24 తేదీల్లో నిమజ్జనం చేయరాదన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

మరింత పకడ్బందీగా ఈ-నామ్ అమలు

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ విధానాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సి. రామాంజనేయులు ఆదేశించారు. బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మార్కెట్ కమిటీల సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మార్కెటింగ్ శాఖ లక్ష్యాలను 100 శాతం సాధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలో 2022-23తో పోలిస్తే 2023-24లో మార్కెట్ ఫీజు వసూలు మెరుగ్గా ఉందని తెలిపారు. మార్కెట్‌కు పంటలను తీసుకువచ్చిన రైతులు తిరిగి సంతోషంగా వెళ్లే వాతావరణం మార్కెట్‌లో కల్పించాలని చెప్పారు. సమావేశంలో కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, నంద్యాల మార్కెటింగ్ శాఖ అధికారి రహిమాన్, కర్నూలు, నంద్యాల, ఆదోని మార్కెట్ కమిటీల సెక్రటరీలు గోవిందు, కల్పన, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19వ రోజు 591 మంది ఎంపిక



పరుగు పోటీలకు హాజరైన మహిళా ఎస్‌ఐ అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన పురుష, మహిళా అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో 19వ రోజు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, వైఎస్సార్ కడప జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ తుషార్ డుడి పర్యవేక్షణలో బుధవారం జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 1,096 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టు నిర్వహించారు. అనంతరం శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించగా 1600 మీటర్ల పరుగులో 767 మంది, 100 మీటర్ల పరుగులో 481 మంది, లాంగ్‌జంప్‌లో 547 మంది ప్రతిభ కనపరచి ఉత్తీర్ణులయ్యారు. అన్ని ఈవెంట్స్‌లో 591 మంది అర్హత సాధించి తుదిరాత పరీక్ష (మెయిన్స్)కు ఎంపికయ్యారు.

అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు



అధికారుల తనిఖీల్లో పట్టుబడిన టిప్పర్

కర్నూలు (న్యూసిటీ): బి.తాండ్రపాడు సమీపంలోని జగన్నాథ గట్టుపై అక్రమంగా మట్టి తవ్వితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. గట్టుపై ట్రిపుల్ ఐటీకి సంబంధించిన భూముల్లో కొందరు అక్రమంగా మట్టి తవ్వుతున్నారని వర్సిటీ రిజిస్ట్రార్ గురుమూర్తి స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో మైనింగ్ అధికారులు బుధవారం తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ మట్టిని తరలిస్తున్న టిప్పర్ కనిపించడంతో సీజ్ చేశారు. వాహన యజమాని శంకర్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు డీడీ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ ఉన్నారు.

మిర్చి మిలమిల!

పశ్చిమ ప్రాంతంలో పెరుగుతున్న ఎర్రబంగారం సాగు

- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 49,660 ఎకరాలు మాత్రమే
- ఈ క్రాప్ ప్రకారం ఇప్పటికే 1,26,913 ఎకరాలకు పైగా సాగు..
- ధరలు ఆశాజనకంగా ఉండటంతో పంటపై రైతుల ఆసక్తి
- దిగుబడి నగటున ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మార్కెటింగ్ నదుపాయం

ఎండుమిర్చి సాగు అంటే గుంటూరు జిల్లా గుర్తుకు వచ్చేది. ఇప్పుడు ఆ జిల్లాను మించి కర్నూలు జిల్లాలో ఎర్రబంగారం సాగు అవుతుంది. ప్రస్తుతం తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర పలుకుతుండటంతో రైతులు ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో మిరప సాధారణ సాగు విస్తీర్ణం 49,660 ఎకరాలు కాగా ఇప్పటికే లక్ష ఎకరాలకు పైగా సాగు కావడం విశేషం.

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో మిర్చి సాగుపై విమర్శలు ఉన్నాయి. బీమా కోసం రైతులు మిర్చి సాగు చేసినట్లు చూపుతారనే అభిప్రాయం ఉండేది. ఈ అభిప్రాయం తప్పని గత ఏడాదే నిరూపణ అయింది. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి కూడా రికార్డు స్థాయిలో ఎండు మిర్చి సాగువుతుంది. ప్రస్తుతం జిల్లాలో మిరప నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ-క్రాప్ ప్రకారమే 1,26,913 ఎకరాల్లో మిరప సాగు అయినట్లు తెలుస్తోంది. 68వేల మందికిపైగా రైతులు ఈ పంట సాగులో రాణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వేరుశనగ, ఉల్లి, టమాట, పత్తి రైతులు మిర్చి పంటల వైపు దృష్టి సారించడంతో సాగు పెరుగుతుంది. పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఆదోని నియోజక వర్గాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని వివిధ మండలాల్లో ఎటు చూసినా మిరప పంటే కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి మిరప నారుమళ్లు పోశారు.

పెరిగిన మార్కెటింగ్ సదుపాయం

గతంలో మిర్చి అమ్ముకోవడానికి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మాత్రమే అవకాశం ఉండేది. కర్నూలు మార్కెట్‌కు రెండో రకం నాణ్యత కలిగిన మిర్చి ఎక్కువగా వస్తుంది. మంచి నాణ్యత కలిగినది గుంటూరు మార్కెట్‌కు వెలుతోంది. మిర్చి పంటను అమ్ముకోవడంలో రైతులు పడుతున్న ఇక్కట్లను గుర్తించిన ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయాన్ని వారికి మరింత దగ్గర చేసింది. కొత్తగా నంద్యాలలో కూడా మిర్చి యార్డును ప్రారంభించడం రైతులకు కలిసి వచ్చింది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోనే ఈ యార్డు నడుస్తుంది.



ఆలూరు మండలం హులేబీడులో సాగు చేసిన మిరప

రికార్డు స్థాయి ధర పలుకుతున్న ఎండుమిర్చి

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండు మిర్చి క్రయవిక్రయాలు కూడా ఈ-నామ్ విధానం లోనే జరుగుతున్నాయి. రాష్ట్రంలోనే ఎండుమిర్చి క్రయవిక్రయాలకు గుంటూరు ప్రసిద్ధి గాంచింది. అక్కడి మిర్చి యార్డుతో పోలిస్తే కర్నూలు మార్కెట్‌కు వచ్చే మిర్చి నాణ్యత అంతగా ఉండదు. కాని ధరలు పతాకస్థాయిలో లభించడం విశేషం. 2022-23లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 37, 929 క్వింటాళ్ల మిర్చి వచ్చింది. క్వింటాలుకు గరిష్టంగా రూ. 50వేలకు పైగా ధర లభించింది. ధరలు జోరు మీద ఉండటంతో రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మిర్చిలో అధిక దిగుబడి పొందాలంటే సాగునీటి సదుపాయం అవసరం. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) వివిధ మండలాల మీదుగా వెళ్లడం, తుంగభద్ర నది కూడా పలు మండలాల మీదుగా ప్రవహిస్తుండటం బాగా కలసి వచ్చింది. దీనికితోడు నాలుగేళ్లుగా వర్షాలు విస్తారంగా పడుతుండటంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. ఇదిలా ఉంటే వర్షాధారం కింద మిర్చి సాగు చేసిన రైతులు పంట బెట్టకు గురి కాకుండా రక్షక నీటి తడులు ఇచ్చే ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్య సదుపాయం కూడా కల్పిస్తోంది. 2022-23 నుంచి సూక్ష్మ సేద్యం మిర్చికే ఎక్కువగా ఇస్తుండటం విశేషం.



విరగ్గాసిన పూత

ఎకరాకు నగటు దిగుబడి 25 క్వింటాళ్లు!

సుగంధ ద్రవ్యాల పంటగా ఎండుమిర్చిని వ్యవహరిస్తారు. ఈ పంట సాగులో పెట్టుబడి వ్యయం కూడా ఎక్కువగానే ఉంటోంది. ఎకరాకు సరిపోయే నారు రూ.15 వేల వరకు ధర పలుకుతోంది. రసాయన ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చులు, బాడుగలు ఎకరాకు పెట్టుబడి రూ. 1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వస్తుంది. ఉద్యాన శాఖ అధికారుల సమాచారం ప్రకారం ఎకరాకు ఎండుమిర్చి నగటు దిగుబడి 25 క్వింటాళ్ల వరకు ఉంటుంది. రైతులు అవగాహనతో సాగు చేస్తే ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్లు ఆపై కూడా వచ్చే అవకాశం ఉంది.

రికార్డు స్థాయిలో ఎండుమిర్చి సాగు



ఈ ఏడాది జిల్లాలో ఎండుమిర్చి రికార్డు స్థాయిలో సాగు అవుతోంది. ప్రస్తుతం మిర్చి నాట్లు వేసుకోవడం చురుగ్గా జరుగుతోంది. ఈ-క్రాప్ నమోదు ప్రకారం ఇప్పటి వరకు 1,26,913 ఎకరాలు మిర్చి సాగు అయింది. ఈ-క్రాప్ ఈ నెల చివరి వరకు జరుగుతుంది. దీన్ని బట్టి చూస్తే సాగు విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాల వరకు ఉండే అవకాశం ఉంది. గత ఏడాది 1.26 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు అయింది. ఎండుమిర్చి ధర ఆశాజనకంగా ఉండటం, దిగుబడులు మెరుగ్గా ఉండటమే పంట సాగు పెరగడానికి కారణం. మిర్చికి ప్రభుత్వం ఏపీఎంఐపీ ద్వారా సూక్ష్మ సేద్యం సదుపాయం కూడా కల్పిస్తోంది. – పి.రామంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

నిఫా వైరస్ బాధితులకు ప్రత్యేక వార్డు

- ఏర్పాట్లను పరిశీలించిన పెద్దాసుపత్రి సూపరింటెండెంట్



ప్రత్యేక విభాగం వద్ద సూచనలు చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): మన రాష్ట్రంలోకి ఇంకా నిఫా వైరస్ ప్రవేశించకపోయినా ముందుజాగ్రత్తగా బాధితులకు చికిత్స అందించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. గతంలో కోవిడ్ సమయంలో వీబీపీ/నెగిటివ్ ప్రెజర్స్ రూమ్స్/ఐసోలేషన్ రూమ్స్ ఏర్పాటు చేసిన విభాగంలోనే దీనిని ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి పరిశీలించారు. నిఫా వైరస్‌ను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన ప్రొటోకాల్‌ను వైద్యసిబ్బందితో చర్చించారు. కేరళ రాష్ట్రంలో నమోదైన నిఫా వైరస్ కేసుల దృష్ట్యా ఆసుపత్రిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఆసుపత్రిలోని ఐడీ బ్లాక్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఎలాంటి నిఫా వైరస్ కేసు నమోదు కాలేదన్నారు. పల్మనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, అనెస్తీషియా, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ ఫ్యాకల్టీతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు రెడీ చేసినట్లు వివరించారు. సూపర్‌స్పెషలిస్టులు, అనెస్తీషియా/ఎమర్జెన్సీ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరాలజీ వైద్యులు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. పీపీఈ కిట్లకు సంబంధించి తగినంత స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. సీ ప్యాప్, బైప్యాప్ మెషిన్ల కోసం ఎన్‌ఐవీ మాస్కులు అందుబాటులో ఉండేలా సర్జికల్ స్టోర్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. యాంటివైరల్ డ్రగ్స్ రిబావిరిన్, ఫ్లావిపావిర్, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ జగనన్న విద్యా దీవెన

- ఈకేవైసీ, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి
- సచివాలయ ఉద్యోగుల వర్క్‌షాప్‌లో ఎస్సీ, బీసీ సహాయ సంక్షేమాధికారులు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శివారెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెన జిల్లాలో అర్హత కలిగిన విద్యార్థులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సహాయ సంక్షేమాధికారులు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ నూతన కౌన్సిల్ హాల్‌లో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి గ్రామ/వార్డు సచివాలయల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ అసిస్టెంట్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, బీసీ సహాయ సంక్షేమాధికారులు బి. మద్దిలేటి, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రతి విద్యా సంవత్సరం తల్లుల ఖాతాల్లోకి ఫీజులను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అయితే, జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పలు సాంకేతిక కారణాలతో వందల్లో విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ/ వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతా నంబర్లకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించాలన్నారు. ఆధార్ నెంబర్ బ్యాంకు ఖాతా నెంబర్‌కు మ్యాప్ కాకుంటే పోస్టల్ ఖాతా ఓపెన్ చేయించి ఎన్‌పీసీఐకి మ్యాపింగ్ చేయించాలన్నారు. అలాగే 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లుల ఖాతాల్లో జమ అయిన 3వ విడత జగనన్న విద్యా దీవెన మొత్తాలను ఆయా కళాశాలల్లో చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ నంబర్లను కూడా బ్యాంకు ఖాతాకు లింక్ చేయించాలన్నారు. సమావేశంలో కార్యాలయ పర్యవేక్షకులు శివారెడ్డి, డీపీఎంయూ చంద్రమౌళీశ్వరరెడ్డి, శశికుమార్, సీఓలు బెన్నమ్మ, డీపీ సులోచన, శిరీషారెడ్డి, రజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు బంద్

కర్నూలు : గణేష్ నిమజ్జన వేడుకలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు బంద్ చేయించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. వెల్దుర్తి, ఎమ్మిగనూరులో ఈనెల 20వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 22 తేది ఉదయం 10 గంటల వరకు, ఆదోని, గూడూరులో 21వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 23వ తేదీ ఉదయం 10 గంటల వరకు, కర్నూలులో 25వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 10 గంటల వరకు బార్లు, మద్యం దుకాణాల్లో విక్రయాలు జరగకుండా సీజ్ చేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



హొళగుందలో అశేష భక్త జనం మధ్య వినాయకుడి నిమజ్జనోత్సవ ర్యాలీ

బై బై గణేశా..!

వినాయక చవితిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు పల్లెల్లో విశేష పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. భక్తులు భాజా భజంత్రీల మధ్య వినాయక విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా యువకులు నృత్యాలు, విచిత్ర వేషధారణలతో సందడి చేశారు. ఆస్పరిలో వినూత్నంగా ఎద్దుల బండిపై విఘ్నేశ్వరుడిని నిమజ్జనానికి తరలించారు. –సాక్షి నెట్‌వర్క్



ఆస్పరిలో వినాయకుడిని ఎడ్ల బండిపై ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మెడిసిన్, ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ఐఐటీ, నీట్ అకాడమీ ద్వారా శిక్షణ పొంది మెడిసిన్, ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలకు ఎంపికైన 52 మంది విద్యార్థులను బుధవారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీట్‌లో 40 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా 20 మంది మెడిసిన్‌కు, ఐఐటీ, ఎన్ఐటీకి 54 మందికి శిక్షణ ఇవ్వగా 32 మంది ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. ఇదే ఆత్మవిశ్వాసంతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. ఉజ్వల భవిష్యత్తుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల సంస్థల జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవి మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కింద చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థి రూ.50 వేలు నగదు పురస్కారం అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో 8 గురుకుల కళాశాలలు ఉన్నాయని, వాటిలో చదివే ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ఐఐటీ, నీట్ అకాడమీ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

15లోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

కర్నూలు కల్చరల్: సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, పంచాయతీ రాజ్, హౌసింగ్ ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకి సంబంధించి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గత మూడు రోజుల నుంచి రీ సర్వే పనుల్లో జీరో పురోగతి కనబర్చిన వారి వివరాలు తనకు సమర్పించాలని జేసీకి సూచించారు. హౌసింగ్‌కు సంబంధించి తక్కువ పురోగతి ఉన్న హాలహర్వి మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం జేసీ నారపురెడ్డి మౌర్య కొత్తగా వచ్చిన భూహక్కు పత్రాలను త్వరగా పంపిణీ చేయాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి, పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్డీఓలు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



హొళగుంద: టీబీ డ్యాంకు బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 1,700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం నాటికి 4,850 క్యూసెక్కులకు చేరింది. ఎగువన ఉన్న తుంగా ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండడంతో అక్కడి అధికారులు దిగువన ఉన్న టీబీ డ్యాంకు నీటిని వదులుతున్నారు. దీంతో గత మూడు రోజులుగా ప్రవాహం పెరుగుతూ వస్తుంది. డ్యాం నీటి మట్టం 1,633 అడుగులు కాగా బుధవారం ఉదయం 1620.56 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. డ్యాం నుంచి 9,968 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. జిల్లాకు సంబంధించి దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 473 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లల మృతి



డోన్ రూరల్: మండల పరిధిలోని వలసల గ్రామానికి చెందిన 30 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతిచెందాయి. గొర్రెల కాపరి రామాంజనేయులు తెలిపిన వివరాలు.. గొర్రెల మందను కొంత కాలంగా మండల పరిధిలోని కన్నపకుంట గ్రామం వద్ద నిల్వ ఉంచుకున్నారు. మంగళవారం ఉదయం దొడ్డిలో గొర్రె పిల్లలను ఉంచి, గొర్రెల మందను మేత కోసం కొండకు తీసుకెళ్లారు. సాయంత్రం వచ్చే లోపు దొడ్డిలో కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లలు మృతిచెంది ఉండటం చూసి బాధితుడు బోరున విలపించాడు. దాదాపు రూ.లక్ష నష్టం జరిగిందని, అధికారులు నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని కోరాడు.

వ్యక్తి ఆత్మహత్య



లింగన్న(ఫైల్)

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో పురుగు మందు తాగి ఆరెకంటి లింగన్న(64) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఎస్ఐ తిమ్మయ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... లింగన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేసేవాడు. తనకు ఉన్న 1.50 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. పెట్టుబడుల నిమిత్తం బ్యాంకులో, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. గత మూడు సంవత్సరాలుగా పంటలు రాలేదు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. బుధవరం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఏలిసమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతి చెందిన లింగన్న ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



కోసిగిలో...



గోస్పాడు.. పసురుపాడులో రంగులు చల్లుకుంటున్న యువకులు



ఆలూరులో ఉట్టికొడుతున్న దృశ్యం

గణనాయకా.. సెలవిక

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణనాథులకు వీడ్కోలు పలికారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వర్లు మూడు రోజుల పాటు విశేష పూజలందుకుని బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిమజ్జనోత్సవ ర్యాలీలో చిన్నా,పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహల మధ్య రంగులు చల్లుకున్నారు. యువత, విద్యార్థులతో పాటు మహిళలు సైతం నృత్యాలు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఎమ్మిగనూరు వద్ద దిగువ కాలువలో లంబోదరుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఆత్మకూరు ఎర్రగూడురు వద్ద ఎస్ఆర్ఎంసీలో గణనాథులను నిమజ్జనం చేస్తున్న దృశం



డోన్‌లో గంగమ్మఒడికి..



కొలిమిగుండ్లలో నృత్యం చేస్తున్న యువకులు



సి.బెళగల్‌లో నిమజ్జనానికి బయలుదేరుతున్న విఘ్నేశ్వరుడు



బేతంచెర్లలో వినాయక హోమం ..



ఉయ్యాలవాడలో వినాయకుల నిమజ్జనోత్సవ ర్యాలీ

ప్రకాశం జిల్లా మేడిపి వద్ద రోడ్డు ప్రమాదం





హైవేపై ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు, గాయపడిన వారిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

- ట్రావెల్స్ బస్సు- లారీ ఢీకొని ఒకరు మృతి, 16 మందికి గాయాలు



మృతురాలు మానస



గాయ పడిన ట్రావెల్ బస్సు డ్రైవర్

కర్నూలు (టౌన్)/త్రిపురాంతకం: ప్రకాశం జిల్లా మేడిపి వద్ద బుధవారం తెల్లవారు జామున ప్రైవేటు ట్రావెల్ బస్సు, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా మరో 16 మంది గాయపడ్డారు. కడప నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు త్రిపురాంతకం బైపాస్ ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో అందులో నుంచి మార్కాపురానికి చెందిన భీమిశెట్టి మానస, కడపకు చెందిన శివలక్ష్మి, మరో మహిళ అటుగా వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఎక్కారు. కర్నూలు నుంచి మెప్మా ట్రెనింగ్ కోసం 22 మంది ఆ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో విజయవాడకు వెళ్తున్నారు. ట్రావెల్స్ బస్సు త్రిపురాంతకం మండలం మేడపి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో మార్కాపురం చెందిన భీమిశెట్టి మానస (22) అక్కడికక్కడే మృతిచెందగా, అదే ట్రావెల్స్ బస్సు రెండో డ్రైవర్ రాజేష్ రెండు కాళ్లు విరిగాయి. ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న కర్నూలుకు చెందిన బి. శానవ్, స్రవంతి, వెంకటేశ్వరమ్మ, హేమలతారెడ్డి, రామలక్ష్మి, షఫీ ఉన్నీస, జ్యోతి, శివగంగ, మరో ఏడుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్‌ల్లో పల్నాడు జిల్లా వినుకొండ, గుంటూరుకు మెరుగైన వైద్య సేవల కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆర్డో అమరనాథ్, ఎంపీఐ మాధవరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పరామర్శించిన మెప్మా సిటీ మేనేజర్

ప్రమాదం విషయం తెలియగానే కర్నూలు మెప్మా ఆఫీసుకు చెందిన సిటీ మేనేజర్ మురళీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో కలిసి హుటాహుటిన వినుకొండకు బయలు దేరారు. పీడీ నాగశివలీల ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన రీసోర్స్ పర్సన్లు, టీఎల్ఎఫ్ ఆఫీస్ బేరర్లు, జిల్లా మహిళా సమాఖ్యల అధ్యక్షులను ఆయన పరామర్శించారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

- గుండెపోటుతో యువకుడి మృతి



మృతి చెందిన మురళీకృష్ణ (ఫైల్)



యు.రాజు (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జనంలో బుధవారం అపశృతి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ సందుల మురళీకృష్ణ(27) గ్రామంలో విగ్రహాల ఊరేగింపు ముందు అందరితోపాటు ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ ఒక్కసారిగా గుండె పోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి వారు వెంటనే మెరుగైన వైద్యం కోసం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఇతను గతంలో గుండె సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

కుంటలో మునిగి యువకుడి మృతి

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఊడల మద్దయ్య, నాగమ్మ కుమారుడు యు. రాజు(21) ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో ప్రతిష్టించిన వినాయకుడిని స్థానిక కుంటలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాన్ని జారవిడిచే సమయంలో రాజు నీటిలో మునిగిపోయాడు. పక్కనున్న వారు గమనించి చేయందించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. చివరకు అతి కష్టం మీద బయటకు తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఏకైక కుమారుడు అయిన రాజు మరణంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పోలీసులపై సస్పెన్షన్ వేటు



మాట్లాడుతున్న సీఐ దివాకర్‌రెడ్డి

శ్రీశైలం: పేకాట ఆడిన హెడ్‌కానిస్టేబుల్, ఐదుగురు హోంగార్డులను ఎస్పీ రఘువీర్‌రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వన్‌టౌన్ ఎస్ లక్ష్మణరావుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్, హోంగార్డులు ఎం.రామలింగేశ్వరరెడ్డి, రమేష్‌కుమార్, ఎం .హరిగాంధీ, పిడతల సత్యమయ్య, జి.రామయ్య ఇటీవల శ్రీశైలమహాక్షేత్రానికి ప్రత్యేక(డిప్యుటేషన్) విధులపై వచ్చారు. వీరు పోలీసుల విశ్రాంతి గదిలో పేకాట ఆడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్పందించిన ఎస్పీ.. స్థానిక సీఐ, ఎస్ఐలచేత విచారణ చేయించి, నివేదికను తెప్పించుకుని పరిశీలించారు. పేకాట ఆడినట్లు తేలడంతో సస్పెండ్ చేస్తూ, నంద్యాల హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారని సీఐ తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి
- ఔట్‌డోర్ స్టేడియంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ క్రీడాంశంలో తలపడుతున్న బాలికల జట్టు



హ్యాండ్‌బాల్ పోటీలో బాలుర జట్టు

కర్నూలు (టౌన్): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్, హ్యాండ్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గురువారం ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రగ్బీ పోటీలు వాయిదా

ఈనెల 23 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించాల్సిన రగ్బీ ఎంపిక పోటీలు వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు.రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న పోటీల కారణంగా ఈ పోటీలను వాయిదా వేశామని, త్వరలో నిర్వహించే తేదీలుప్రకటిస్తామని వెల్లడించారు.

15 టన్నుల టమాట కొనుగోలు



ప్యాపిలి టమాట మార్కెట్‌లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): టమాట రైతులకు ఊరటనిస్తూ మార్కెటింగ్ శాఖ కొనుగోళ్లను వేగవంతం చేసింది. బుధవారం ప్యాపిలి టమాట మార్కెట్‌లో 15 టన్నులు కొనుగోలు చేయడం విశేషం. మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు కొనుగోళ్లను పరిశీలించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాట క్రయవిక్రయాలకు ప్యాపిలి, పత్తికొండ మార్కెట్‌లు ముఖ్యమైనవి. పత్తికొండ మార్కెట్‌లో ధరలు మెరుగ్గా ఉన్నా.. ప్యాపిలి మార్కెట్‌లో కిలో ధర రూ.7 కంటే తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఈ నెల 19 నాటికి 40 టన్నుల టమాట కొనుగోలు చేసింది. తాజాగా మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో 15 టన్నులు కొనుగోలు చేశారు. ఈ టమాటను జిల్లాలోని వివిధ రైతు బజార్లుకు తరలించి వినియోగదారులకు నోలాస్, నో ప్రాఫిట్ కింద అమ్మకాలు సాగిస్తున్నారు.

క్లుప్తంగా

జీవనశైలి మార్పులతో అల్జీమర్స్ నియంత్రణ

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతో అల్జీమర్స్ వ్యాధిని నియంత్రించవచ్చని మానసిక వైద్యులు డాక్టర్ శివశంకర్‌రెడ్డి చెప్పారు. వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా బుధవారం కర్నూలులోని శిరిడిసాయి వృద్ధాశ్రమంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల మందికి ఈ వ్యాధి ఉన్నట్లు అంచనాలు ఉన్నాయన్నారు. అల్జీమర్స్ డిమెన్షియా ఉన్న వారిలో క్రమేపీ న్యూరాన్ కణాలు క్షీణతకు గురై తద్వారా మెదడు క్షీణతకు గురై తన మేదస్సును, జ్ఞాపకశక్తిని కోల్పోతుందని వివరించారు. ఈ వ్యాధి రాకుండా మధ్య వయస్సు నుంచే జీవనశైలి వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవాలని, మద్యానికి, పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు.

ఫిర్యాదులపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న సూచించారు. బుధవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందించడమే మన కర్తవ్యమని, ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని సూచించారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ వంటి అంతరాయ సమస్యల పట్ల వెంటనే స్పందించాలన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

కర్నూలు కల్చరల్: బీజేపీతోనే మహిళా సాధికారత చేకూరుతుందని ఆ పార్టీ స్పోక్స్ పర్సన్ డాక్టర్ వినూషారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు ఆమోదం లభించడం శుభపరిణామం అన్నారు. చాలా కాలంగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉందని, మోదీ ప్రభుత్వ నిర్ణయంతో బిల్లుకు మోక్షం లభించిందన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి, జిల్లా అధ్యక్షురాలు మాలతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మందుల భద్రతపై సదస్సు

కర్నూలు సిటీ: నేషనల్ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మందుల భద్రతను నిర్ధారించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మైపర్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కర్నూలు మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ ఆచార్యులు డాక్టర్ పి.రాజేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.భానుప్రకాష్, ఫార్మాకో విజిలెన్స్ అసోసియేట్ డి.సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఫార్మాకో విజిలెన్స్ ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ లు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే సకాలంలో పూర్తి చేయాలి



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే'ను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలను, వలంటీర్లను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న పేషంట్ల గృహాలకు మధ్యాహ్న సమయంలో వెళ్లి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతి నిలుపుదలపై విచారణ

కర్నూలు సిటీ: హొళగుంద మండలం మార్లమడికి ఎంపీయూపీ స్కూల్లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న తేనె సాయిబాబాకు రెండు నెలల క్రితం విద్యాశాఖలో కేటాయించిన పదోన్నతి, బదిలీని నిలుపుదల చేశారు. దీనిపై డీఈఓ రంగారెడ్డి జేడీ సర్వీసెస్ మువ్వా రామలింగంపై హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్‌కు సైతం చేసిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట కృష్ణారెడ్డిని ఆదేశించారు. దీంతో ఆర్జేడీ కార్యాలయం సిబ్బంది బుధవారం డీఈఓ కార్యాలయానికి వచ్చి డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యామూల్‌పాల్, సూపరింటెండెంట్లు రాజశేఖర్, రవికుమార్‌తో సాయిబాబా ఫిర్యాదుపై చర్చించారు. విచారణ నిమిత్తం గురువారం ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి కర్నూలుకు రానున్నారు. దీంతో ఫిర్యాదుదారుడికి సంబంధించిన వివరాలతో కూడిన ఫైల్‌ను డీఈఓ ఆఫీస్ సిబ్బంది సిద్ధం చేసుకుంటున్నారు.

మలివయసు మతిమరుపు

- వృద్ధాప్యంలో అల్జీమర్స్ ఎఫెక్ట్
- 15 శాతం మంది వృద్ధుల్లో సమస్య
- కుటుంబసభ్యుల సేవలు కీలకం
- నేడు ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం

కర్నూలు(హాస్పిటల్): చాలా మందికి మతిమరుపు ఉంటుంది. వారి హడావుడి జీవితంలో వచ్చే మతిమరుపే ఎక్కువ. వయస్సు పైబడ్డ వారిలో వచ్చే మతిమరుపు వేరు. దీనిని వైద్య పరిభాషలో అల్జీమర్స్ అంటారు. ఈ వ్యాధి బాధితులు చిన్న చిన్న విషయాలు మరిచిపోతుంటారు గానీ ఎప్పుడో చిన్నప్పుడు జరిగినవి గుర్తుకు తెచ్చుకుని మరీ చెబుతుంటారు. ఇలాంటి వారిని ముందే గుర్తించి తగిన చికిత్స చేయిస్తే వ్యాధి తీవ్రత తగ్గించవచ్చు. ఈ నెల 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగం, న్యూరాలజీ విభాగాల ఓపీకి రోజూ అల్జీమర్స్‌తో వచ్చే వారి సంఖ్య 15 నుంచి 20 మంది దాకా ఉంటుంది. దీంతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలోని సైకియాట్రిస్టులు, న్యూరోఫిజీషియన్ల వద్దకు మరో 50 మంది దాకా చికిత్స కోసం వస్తుంటారు. ఈ సమస్యతో వచ్చిన వారి లక్షణాలు గమనించి వైద్యులు చికిత్స చేసి మందులు సూచించి పంపిస్తారు. రోగిని ఎలా సంరక్షించాలో కుటుంబ సభ్యులకు సూచనలు చేస్తారు. ఒక్కోసారి డిమెన్షియాతో బాధపడే వారిని ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. డిశ్చార్జ్ అయ్యాక వారిని పర్యవేక్షించాలంటే కుటుంబ సభ్యులకు చాలా ఓర్పు, సహనం అవసరం. బాధితులపై మమకారం, ప్రేమాభిమానాలు ఉంటేనే వారిని జాగ్రత్తగా చూసుకోగలరు. నేటి సమాజంలో ఇవి తగ్గిపోవడంతో అల్జీమర్స్, డిమెన్షియా వచ్చిన వారు నిర్లక్ష్యానికి గురై త్వరగా మరణిస్తున్నారు.

అల్జీమర్స్ ఎలా వస్తుందంటే

మెదడులో కణాలు చనిపోతుండటం వల్ల వచ్చే నాడీ సంబంధిత వ్యాధి అల్జీమర్స్. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం దెబ్బతింటాయి. ఇటీవల సంఘటనలు, విషయాలను మరిచిపోవడంతో మొదలై క్రమంగా పెరిగి చివరకు తానెవరో తెలియని స్థాయికి ఈ మతిమరుపు విస్తరిస్తుంది. బాగా పరిచయస్తులు ఎదురుగా ఉన్నా గుర్తుపట్టలేకపోవడం, చేతిలోని వస్తువును ఎక్కడ పెట్టారో మరిచిపోవడం జరుగుతుంది. ఈ వ్యాధికి, ఒత్తిడికి అవినాభావ సంబంధముంది. ఇది ఏ వయస్సులోనైనా రావచ్చు.

సీనియర్ సిటిజన్స్‌లోనే ఎక్కువ

అల్జీమర్స్ అధికంగా వృద్ధులకు వచ్చే అవకాశం ఉంటుంది. బాధితుల ఆలోచనా విధానం, ప్రవర్తనపై ప్రభావం కనిపిస్తుంది. దీనిభారిన పడిన వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. 65 ఏళ్లు పైబడిన వారిలో 5 శాతం మందికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉండగా 80 ఏళ్ల వయస్సు వారిలో 20 శాతం వరకు వచ్చే అవకాశం ఉంది.

వ్యాధికి కారణాలు

- మతిమరుపు జబ్బు వారసత్వంగా సంక్రమించే అవకాశం ఎక్కువ.
- మెదడులో 'అసిటైల్ కోలిన్' అనే రసాయనిక ద్రవం తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది.
- దీర్ఘకాలంగా ఆల్కహాలు లాంటి మత్తు పదార్థాలు తీసుకోవడం, అకారణంగా నిద్రమాత్రలు వాడటం వల్ల కూడా వస్తుంది
- ఏళ్ల తరబడి మానసిక ఒత్తిడికి గురికావడం, పోషకాహారం తీసుకోకపోవడం, అదుపులో లేని బీపీ, షుగర్ వల్ల మతిమరుపు సమస్య వచ్చే అవకాశం ఉంది.

నివారణ మార్గాలు

- జబ్బును మొదటి దశలో గుర్తిస్తే మందుల వాడకం వల్ల తీవ్రత తగ్గించవచ్చు.
- బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవడం
- మద్యం, మత్తు, డ్రగ్స్ జోలికి వెళ్లకపోవడం
- మెదడును ప్రేరేపించే పద్ధతులు పత్రికలు చదవడం, చదివించడం, క్యాలెండర్ చూడటం, పిల్లలు, పెంపుడు జంతువులతో గడపడం ప్రోత్సహించాలి.

వ్యాధి లక్షణాలు

- కళ్లద్దాలు, ఇంటి తాళాలు వంటివి ఎక్కడో భద్రంగా దాచిపెట్టి మరిచిపోతారు. కుటుంబ సభ్యుల పేర్లు కూడా జ్ఞాపకం ఉండవు.
- మాట్లాడేటప్పుడు పదాల కోసం తడుముకుంటారు. కొద్దినిమిషాల కిందటే జరిపిన సంభాషణను కూడా మరిచిపోతుంటారు.
- ఒకే ప్రశ్నను పదేపదే అడుగుతుంటారు.
- టీవీ ముందు కూర్చుంటే అనాలోచితంగా గంటల తరబడి అక్కడే గడిపేస్తారు. టీవీలో కనిపించేవి వినిపించేవి ఏవీ వాళ్ల తలకెక్కవు. - వాతావరణంతో సంబంధం లేకుండా దుస్తులు వేసుకుంటూ ఉంటారు.
- అకారణంగా పట్టరాని కోపం, నియంత్రించలేని దుఃఖం ఇలా తరచూ భావోద్వేగాలపై పట్టు కోల్పోతుంటారు.

కుటుంబ సభ్యుల పాత్ర కీలకం



మా ఓపీ విభాగానికి ప్రతిరోజూ 10 నుంచి 20 మంది అల్జీమర్స్ బాధితులు వస్తుంటారు. బాధితులకు సేవలందించడంలో కుటుంబ సభ్యుల పాత్రే కీలకం. బాధితులు దైనందిత కార్యక్రమాలు చాలా వరకు మరిచిపోతుంటారు. ఎంతో ఓర్పు, సహనంతో అవన్నీ గుర్తు చేస్తూ ఉండాలి. అల్జీమర్స్ బాధితులకు ఆసుపత్రిలో మందులు, కౌన్సిలింగ్‌ను ఉచితంగా అందజేస్తున్నాం.

–డాక్టర్ డి.గంగాధర్‌నాయక్, సైకియాట్రిస్ట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ముందుగా గుర్తించి జాగ్రత్త పడాలి



అల్జీమర్స్ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి వైద్యుల వద్ద చికిత్స చేయిస్తే తీవ్రత పెరగకుండా జాగ్రత్త పడవచ్చు. మందుల ద్వారా ఈ వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చు. ఇందులో చాలా రకాలున్నాయి. ఒక్కో రకానికి ఒక్కో చికిత్స ఉంటుంది. కొన్నిసార్లు బీ12 విటమిన్ లోపం, థైరాయిడ్ హార్మోన్ల అసమతుల్యత, డిప్రెషన్ ఉన్నా మతిమరుపు వస్తుంది. ఆయా సమస్యలకు మందులు ఇస్తే సమస్య పరిష్కారం అవుతుంది. దీనికి పూర్తిగా చికిత్స లేదు. బ్రెయిన్ ట్రైనింగ్స్, ఫజిల్స్, వీడియో గేమ్స్ వంటివి ఆడుతూ మెదడు పదును పెంచుకోవాలి.

–డాక్టర్ హేమంత్‌కుమార్, న్యూరో ఫిజీషియన్, కర్నూలు

నేడు విద్యుత్ శాఖ కర్నూలు డివిజన్ల సమీక్ష

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ టౌన్, రూరల్స్ డివిజన్ల సమీక్ష సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు సంస్థ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు బుధవారం సాయంత్రం కర్నూలుకు చేరుకున్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ హాలులో రెండు డివిజన్ల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, జూనియర్ ఇంజినీర్లు, అకౌంట్స్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో నిబంధనలు పాటించని డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు ఏఐవైఎఫ్ నాయకులు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ కొత్తబస్టాండ్ సమీపంలోని జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్ వారు ఎలాంటి నిబంధలు పాటించడం లేదని, ఆర్ఎంపీల సహకారంతో గర్భిణులకు స్కానింగ్‌లు సైతం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నగర అధ్యక్షుడు బాబయ్య, నాయకులు చంటి, హుసేన్, బద్రి, లోకేష్ ఉన్నారు.

స్థల వివాదంలో నలుగురిపై కేసు

కర్నూలు: నగర శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న దివ్య బార్ అండ్ రెస్టారెంట్‌ను జేసీబీతో కూల్చివేశారని శివలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. నర్సింహులు, డేవిడ్, శంకర్ గౌడ్, కూస్పాటి రాజశేఖర్‌లతో శివలింగారెడ్డికి స్థల విషయంలో వివాదం ఉంది. దీనిపై కోర్టుకు వెళ్లగా శివలింగారెడ్డికి అనుకూలంగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో పై నలుగురు కలసి మంగళవారం రాత్రి దివ్య బార్ గోడను కూల్చివేయడంతో శివలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు మూడవ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

భూహక్కు పత్రాలు పంపిణీ చేయండి



వెబెక్స్‌లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు కల్చరల్: భూహక్కు పత్రాల పంపిణీ త్వరితగతిన చేపట్టడంతో పాటు భూరక్ష (సరి హద్దు రాళ్ల)ను పాతించాలని సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ సూచించారు. బుధవారం విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా రీసర్వే పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే పనుల వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. రీసర్వే పనులలో భాగంగా ఇచ్చిన వారాంతపు లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఫేజ్–3లో భాగంగా 160 గ్రామాల్లో రీసర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే ఏడీ విజయసారథి, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమాకాంత్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రచయిత్రికి అరుదైన గౌరవం



చంద్రమౌళిని

కర్నూలు కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక అమెరికాలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న 'నారీ సాహిత్య భేరి' అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు తానా అధ్యక్షులు నిరంజన్, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్, సమన్వయకర్త శ్రీనివాస్ ఆమెకు ఆహ్వానం పంపారు. 14 గంటల పాటు నిరిర్విరామంగా జరిగే సాహిత్య సమ్మేళనంలో భారత్‌తో పాటు 15 దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు, రచయిత్రులు పాల్గొననున్నారు. ఇందులో చంద్రమౌళిని మహిళా సాహిత్యం, కవిత్వంపై ప్రసంగించనున్నారు. తానా సమ్మేళనానికి ఆహ్వానం అందడంపై ఆమెకు సరసం సాహితీవేత్తలు, కందనవోలు కవయిత్రులు, సాహితీ సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రమౌళిని ప్రస్తుతం గోనెగండ్ల మండలంలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.

మతతత్వ పార్టీలను సాగనంపుదాం

కర్నూలు కల్చరల్: మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్న బీజేపీ, అండగా ఉంటున్న ఇతర పార్టీలను సాగనంపి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్థానిక కార్మిక కర్షక భవనంలో కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల పార్టీ కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లౌకిక రాజ్యాంగం కాపాడుకునేందుకు మతతత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తూ కలిసొచ్చే మిత్రులను కలుపుకుని ముందుకుపోవాలని ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, కార్యవర్గ సభ్యులు బి.రామాంజనేయులు, పీఎస్ రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు రాముడు, రాజశేఖర్, మోహన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు కల్చరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న దశల వారీ ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న దశల వారీ ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- 20వ వార్డులో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులో ప్రాధాన్యతలను అనుసరించి శివారు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని అరుంధతీ నగర్, బద్రీనాథ్ కాలనీల్లో రూ.70 లక్షలతో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి, ధనలక్ష్మి నగర్‌లో రూ.40 లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పనుల్లోనూ దూసుకుపోతుందన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని దోచుకున్న వారందరికీ చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందేమోననే అనే భయం నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కల్లూరు అర్బన్ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


నగరంలోని అన్ని వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా కమీషన్ల కోసం నాసిరకంగా పనులు చేయడం లేదన్నారు. కర్నూలు నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, అరుణ, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎస్ఈ పి.వి.శేషసాయి, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమ శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యూనూస్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్తారి వీధిలో రుద్రాక్షలు, పసుపు కొమ్ములతో రూపుదిద్దుకున్న వినాయకుడు



మించిన్ బజార్‌లో దశకంఠ రూప గణనాథుడు



ఎర్రబురుజు వద్ద కొలువు దీరిన వినాయకుడు



ఎన్నార్ పేటలో పూజలందుకుంటున్న వినాయకుడు

ఏక దంతాయ.. బహు రూపాయ



కలెక్టరేట్‌లో పరిపాలనా గణపతికి హారతిఇస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య



చాణిక్యపురి కాలనీలోని వినాయక మండపం వద్ద కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ కైపా పద్మలత



అశోక్‌నగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద..

కర్నూలు కల్చరల్: నగరంలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు బుధవారం పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల నిర్వాహకులు పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలనా గణనాథునికి నిర్వహించిన పూజల్లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు. 17వ వార్డు హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి నిర్వహించిన పూజల్లో కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ కైపా పద్మలత పాల్గొని అన్నదానం చేశారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.



వీఆర్ కాలనీ రోడ్ నంబర్- 4లో ప్రత్యేక ఆకర్షణగా గణనాథుడు



బండిమెట్ట ప్రధాన వీధిలో..



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జౌ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.



రష్మిక శుభారంభం

అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6–3, 6–3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)–మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6–4, 7–6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)–మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం ● ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత

హాంగ్జౌ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25–27, 29–27, 25–22, 20–25, 17–15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సొనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.



సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్



దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.

అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్ హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4–జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్–100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్


అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్–20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4–5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌ట్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3–2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10–0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9–6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...


● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

– నిర్మాత 'బన్నీ' వాసు


● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

– శ్రీకాంత్


● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్కైన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ– ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ– ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ– ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడ బుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.


● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ– ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు. క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ– ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.


● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ– ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ– ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్.. ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.